ప్రజాశక్తి

శనివారం 7 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఒంగోలులో డీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అన్సారియా

మెగా డీఎస్సీ పరీక్షలు ప్రశాంతం

తొలి రోజు 81 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

శుక్రవారం నాడు ప్రారంభించిన మెగా డిఎస్సీ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. పలు చోట్ల పరీక్షా కేంద్రాలను కలెక్టర్ తమీమ్అన్సారియా తనిఖీ చేశారు. జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆన్లైన్ కంప్యూటరు బేస్డ్ టెస్ట్ (సీబీటి) పద్ధతిలో నిర్వహించిన ఈ పరీక్షకు ఉదయం, సాయంత్రం సెషన్స్‌లో ఐదు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 791 మందికి 617 మంది హాజరు కాగా, 81 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో 100 మందికి గానూ 89 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరయ్యారని, డాక్టర్ శామ్యూల్ జార్జ్ ▶ 2లో

తీరంలో ఇసుక దిబ్బలు తొలగించి చదును చేసిన దృశ్యం

తీరమంతా.. ఆక్రమణాల పర్వం

- యథేచ్ఛగా సీఆర్‌జెడ్ ఉల్లంఘనలు
- భారీ స్థాయిలో వెంచర్లు వేస్తున్న రియల్టర్లు
- ఇసుక దిబ్బలు, సర్వీ తోపులను తొలగిస్తున్న వైనం
- ప్రకృతి విపత్తుల సమయాల్లో గ్రామాలు మునిగిపోతాయని మత్స్యకారుల ఆవేదన

రిసార్ట్స్ నుంచి సముద్రంలోకి రహదారి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. జిల్లాలో 103 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న సముద్రతీరంలో బాపట్ల సూర్యలంక నుంచి చినగంజాం వరకు ఉన్న సముద్రతీరంలో భారీఎత్తున రిసార్టులు, స్టార్ హోటళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. దీంతో పాటు తీరం వెంట ఉన్న భూములన్నీ కొనుగోలు చేసిన రియల్‌ఎస్టేట్ల వారు భారీ ఎత్తున వెంచర్లు వేస్తున్నారు. ఇక్కడ భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రియల్ ఎస్టేట్‌ల వారు తీరంలో ఉన్న పట్టా భూములతో పాటు తీరంలో ఉన్న అనాదిగా మత్స్యకారుల అధీనంలో ఉన్న భూములను తమ సొంతం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కారణంగా తీరప్రాంత గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. దీంతో పాటు జిల్లాలోని సముద్రతీర ప్రాంతాలు, మత్స్యకార గ్రామాలు ముంపులు గురికాకుండా ప్రకృతి సిద్ధంగా తీరం వెంట పెద్ద ఇసుక దిబ్బలు గతంలో ఉండేవి. ఈ ఇసుక దిబ్బలతో పాటు సముద్ర తీరం కోతకు గురికాకుండా సర్వీ, జామాయిల్ తోటలు రక్షణ గోడలుగా ఉండేవి. గతంలో వచ్చిన సునామీ సమయంలో ఈ ఇసుక దిబ్బలే మత్స్యకార గ్రామాలు ముంపునకు గురికాకుండా రక్షణనిచ్చాయి. కానీ తీరంలో రిసార్టులు, రియల్‌ఎస్టేట్‌ల వారి రాకతో అవన్నీ మాయమవుతున్నాయి. తీరంలో నిర్మాణాలు జరుపుతున్న రిసార్టుల వారు తమ ఎదురుగా ఇసుక దిబ్బలను చదును చేస్తున్నారు. సర్వీ తోపులను తొలగించి తమ రిసార్టుల నుంచి నేరుగా బీచ్‌లోకి వెళ్ళేందుకు మార్గాలు ▶ 2లో

'నల్లబర్లీ' రైతుల్లో చిగురించిన ఆశలు

- మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం కీలక నిర్ణయం
- రంగంలోకి అధికారులు

గోడౌన్లు పరిశీలించేందుకు వచ్చిన మార్క్‌ఫెడ్ ఎండీ మంజీర్ జిలానీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నల్లబర్లీ పొగాకు రైతుల కష్టాలు వీడనున్నాయి. పొగాకు రైతుల వరుస ఆందోళనలు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చొరవ ఫలితంగా ప్రభుత్వం పొగాకు రైతుల సమస్యలపై కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రప్రభుత్వం మొట్టమొదటిసారి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోళ్లు చేయనుంది. రాష్ట్రంలో ఏడు మార్కెట్ యార్డుల ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత సమావేశాల్లో జరిగిన నిర్ణయాల మేరకు బర్లీ పొగాకును ఐటీసీ, జీపీఐ సంస్థలు కలిపి 25 మిలియన్ కిలోలు, చిన్న కంపెనీలు 20 మిలియన్ కిలోల చొప్పున కొనాల్సి ఉంది. సదరు కంపెనీలు కొనగా రైతుల వద్ద మిగిలి ఉన్న నల్లబర్లీని ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొంటుంది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, పెదనందిపాడు, ప్రత్తిపాడు, చిలకలూరిపేట, మద్దిపాడు యార్డుల ద్వారా బర్లీ పొగాకును కొనుగోలు చేయనున్నారు. నల్లబర్లీ పొగాకు మొదటి గ్రేడ్‌ను క్వింటాలు రూ.12 వేలకు తగ్గకుండా, రెండో గ్రేడ్‌ను రూ.6 వేలు చొప్పున కొనాలని కంపెనీలను ఆదేశించారు. బర్లీ పొగాకు నేరుగా రైతుల నుంచి ప్రభుత్వమే కొనుగోలు చేయటం వల్ల ప్రభుత్వంపై సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల పైబడి ఆర్థిక భారం పడనుందని తెలుస్తోంది.

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని మార్కెట్ యార్డుల ద్వారా బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్షేత్ర స్థాయిలో పంట నిల్వలకు గోడౌన్లను, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. కంపెనీలు కొనగా మిగిలిన బర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న పొగాకు రైతులు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల కోసం తీసుకున్న నిర్ణయం పట్ల కతజ్ఞతగా పర్చూరులో ప్రదర్శన నిర్వహించారు. సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఏలూరి కృషిని మరువలేమన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- పేదల సంక్షేమమే లక్ష్యం
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్

సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర పునర్నిర్మాణం పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అనగాని మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధ్వంసం, అరాచక పాలనలో 30 సంవత్సరాల అభివృద్ధి వెనక్కి వెళ్లిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో వ్యవస్థలను గాడిలో పెట్టి.. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు సిఎం చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయిలో ప్రజాఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేసి.. దేశంలోనే మన రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపాలనే ఆశయంతో కూటమి సర్కార్ పనిచేస్తోందన్నారు. గత సంవత్సరం జూన్ 4న రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమన్నారు. అరాచక పాలన పై యుద్ధం చేసిన ప్రజలు కూటమి సర్కార్‌కు 164 సీట్లు ఇచ్చి స్వాగతం పలికారని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ప్రతి నెలా ఒక మంచి కార్యక్రమం చేపట్టాలనే ఆశయంతో కూటమి సర్కార్ పనిచేస్తుందన్నారు. అధికారం ▶ 2లో

తీరమంతా ఆక్రమణల పర్వం..

(మొదటిపేజీ తరువాయి)

వేస్తున్నారు. పది ఎకరాల్లో రిసార్టు నిర్మాణం జరిపితే దాని ఎదురుగా ఉన్న మరో 10 ఎకరాలు సముద్రతీరాన్ని కబ్జా చేస్తున్నారు. పెళ్లిళ్లు, వేడుకలు, పార్టీల కోసం తీరం మొత్తాన్ని తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. తీరం వెంట రక్షణగా ఉన్న ఇసుక దిబ్బలను తొలగించడం ప్రమాదకర మని పర్యావరణవేత్తలు, మత్స్యకారులు చెబుతున్నా తీరం యథేచ్ఛగా ఆక్రమణల చెరలో చిక్కుకుంది. సముద్రతీర మంతా జేసీబీలు, ట్రాక్టర్లతో ఇసుక దిబ్బలను చదును చేస్తున్నా అధికారులు ఎవరు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. సముద్రతీరమంతా తాటి చెట్టంత ఇసుక దిబ్బలు ఉండేవని రిసార్టులు, రియల్ ఎస్టేట్‌ల వారి రాకతో అదంతా తరలించేస్తున్నారని, రాజకీయ నాయకుల అండ చూసుకుని రెచ్చిపోతున్నారని మత్స్యకార గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఆర్‌జెడ్ నిబంధనలను అతిక్రమించి పెద్ద ఎత్తున తీరం ఆక్రమణలకు గురవుతుందని చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే నేరుగా సముద్రంలోకి రహదార్ల నిర్మాణాలు జరుపుతున్నారని చెబుతున్నారు. పలు పర్యాయాలు జిల్లా అధికార యంత్రాంగానికి తెలియజేసినా పట్టనట్లు ఉంటున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా చీరాల, బాపట్ల మండలాల పరిధిలో పొలాల నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు చీరాల నియోజక వర్గంలోని వేటపాలెం, ఈపూరుపాలెం ప్రాంతాల్లో గతంలో స్ట్రయిట్‌కట్‌లు నిర్మించారు. ఇవి జిల్లాలోని ఎగువ ప్రాంతం నుంచి సముద్ర తీరం వరకు ఒక్కొక్కటి దాదాపు 11 కిలోమీటర్ల పొడవునా ఉంటాయి. వీటిలో ఒకటయిన ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ సముద్రంలో కలిసే చోట వంపుగా ఉంటుంది. ఇక్కడ తమ పట్టా భూమి ఉందని 2023 నవంబరులో వైఎస్సార్సీపీకి చెందిన వ్యక్తి దీని స్వరూపాన్ని మార్చేసి, కొండరాళ్లతో గట్టు ఏర్పాటు చేశారు. దీని పక్కనే అతని రిసార్ట్ ఉండటంతో దాన్ని మరింత విస్తరించేందుకు ఇలా చేశారని తెలుస్తోంది. దీనిపై ఆ ప్రాంత మత్స్యకారులు ఆందోళన చేయడంతో అప్పటి కలెక్టర్ పరిశీలించి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో అది కాస్తా మరుగు నపడింది. ప్రస్తుతం సదరు వ్యక్తి అధికార పార్టీలో చేరారు. స్ట్రయిట్‌కట్ స్వరూపం మార్చిన చోట ఏకంగా సముద్రం ఆటుపోట్లు వచ్చే ప్రదేశంలో ట్రాక్టర్లతో చదును చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడే గతం నుంచి విజయలక్ష్మి పురం మత్స్యకారులు పడవలు, వలలు పెట్టుకుంటారు. ఇదంతా ఆక్రమణలోకి వెళుతోంది. తమ స్వప్రయోజనాల కోసం తీరం వెంట ఉన్న ఇసుకదిబ్బలను తొలగించి చదును చేస్తే సునామీ లాంటి ఉపద్రవాలు వస్తే అడవిపల్లెపాలెం, పచ్చమొగిలి, విజయలక్ష్మీపురం గ్రామాలు ముంపు బారిన పడతాయని వారు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా ఇక్కడ వివాదం నెలకొంది. అయినా అధికారులు ఏమీ పట్టనట్టు ఉంటున్నారు. జిల్లా అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి పట్టా భూమి ఎంత ఉంది, ప్రభుత్వ భూమి ఎంత.? అని సీఆర్‌జెడ్ పరిధి గుర్తించి తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. రిసార్టుల రాకతో మత్స్యకారులు పడవలు ఎక్కడ పెట్టుకోవాలి అనే సమస్య ఉత్పన్నమవుతోంది. అక్కడకక్కడా వివాదాలు వస్తున్నాయి. ఘర్షణ పూరిత వాతావరణం నెలకొంటుంది. ఈ సమస్యలపై జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించాల్సి ఉంది. జిల్లాలో రిసార్ట్స్ యజమానులు కోస్టల్ రెగ్యులేషన్ చట్టానికి లోబడి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

మెగా డీఎస్సీ పరీక్షలు ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌స్టిట్యూట్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో 120 మందికి 106 గురు హాజరు కాగా, 14 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒంగోలులోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నందు ఉదయం 100కు 96 మంది హాజరు కాగా నలుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. సాయంత్రం సెషన్‌లో 101 మందికి 93 మంది హాజరు కాగా 8 మంది ఆబ్సెంట్ అయినట్లు తెలిపారు. కష్ణ సాయి ప్రకాశం కాలేజీ నందు 170 మంది కి 147 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారని, రైస్ కృష్ణసాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీ లో 200 మందికి 179 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

పోలీస్ అధికారి అశోక్‌బాబుకు సూర్యశ్రీ ట్రస్ట్ సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా ఏఆర్ ఏఎస్‌పి ఎంఎస్ఎస్ అశోక్‌బాబు నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా శుక్రవారం నాడు సూర్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్టు వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ఆయనను ఘనంగా సత్కరించారు. సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ షహనాజ్, సర్దార్ బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ మంచి పోలీసు అధికారిగా, సేవా కార్యక్రమాల్లో ముందుండి తన అమూల్యమైన సలహాలు ఇస్తూ సూర్యశ్రీ ట్రస్ట్‌కు అండగా నిలిచిన అశోక్‌బాబు ఎస్పీగా పదోన్నతి పొందడం ఆనందదాయకమని అన్నారు. ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ పోలీస్ అధికారిగా విలువలతో బాధ్యతగా పనిచేశానని, భవిష్యత్తులో ఎక్కడున్నా అండగా ఉంటామని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో మండవ సుబ్బారావు, సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు, ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్లూరి మోహన్‌రావు, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వడ్డేంపూడి సుజాతరావు, సేవ్ ది యానిమల్ ఫౌండేషన్ నిర్వాహకులు కోసూరి శ్రీదేవి, తాటిపర్తి దివ్య చౌదరి, జనసేన శ్రీనివాసరావుతో పాటు ట్రస్టులోని వికలాంగులు పాల్గొన్నారు.

పోలీసు అధికారి అశోక్‌బాబును సత్కరిస్తున్న ట్రస్టు నిర్వాహకులు

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం: ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గిద్దలూరు నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రానున్నారని నియోజకవర్గంలోని కొమరోలు, రాచర్ల, కంభం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు, ప్రారంభోత్సవాల అనంతరం కంభం పట్టణంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి పర్యటన తేదీని త్వరలోనే తెలియచేస్తామని, నియోజకవర్గంలోని ఆరు మండలాల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని మంత్రి గొట్టిపాటి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సొరెడ్డి మోహన్‌రెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, మార్తాల సుబ్బారెడ్డి, కటికె యోగానంద్, సయ్యద్ శానేషావలి, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాసులు, సొసైటీ బ్యాంకు చైర్మన్లు ముత్తుముల సంజీవరెడ్డి, దుత్తా బాలఈశ్వరయ్య, గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, గిద్దలూరు పట్టణ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా డిఎస్‌సి పరీక్షలు

ప్రజాశక్తి-మార్కాపురం

డిఎస్‌సి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మార్కాపురం సమీపం లోని జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో, దేవరాజుగట్టు సమీపంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డిఎస్‌సి పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జార్జి ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో 120 మంది అభ్యర్థులకు గాను 106 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరైనట్లు డిఓ డి రామాంజనేయరెడ్డి తెలిపారు.

వేలం నిర్వహిస్తున్న అధికారులు

కౌలు వేలం పాటలు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామం శ్రీ మందపాల తిరుమలనాథ స్వామి ఆలయం సంబంధించిన భూములకు, గోపాలునిపల్లి గ్రామం శ్రీ త్రిపురాంతకేశ్వర స్వామి శ్రీ వేణు గోపాలస్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములను ఆయా దేవస్థానాల్లో శుక్రవారం శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయ ఈఓ మల్లవరపు నాగయ్య పర్యవేక్షణలో గిద్ద లూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వహణాధి కారి చిక్కుడు శ్రీనివాసులు బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించారు. దేవస్థాన భూముల కౌలు రైతులకు కౌలు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రెడ్డిచర్ల ఆలయ ధర్మకర్త రెడ్డిచర్ల శ్రీనివాసరాజు, గోపాలునిపల్లి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వీరంరెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కె శ్రీనివాసరావు, పాటదారులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అనంతరం గ్రంథ పాలకులు కే సత్యనారాయణ, మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఏ కరుణాకరరావు విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్ఎస్ ఈవెంట్స్ అధినేత రామ్‌సాయి నాయుడు ఆధ్వర్యంలో హైపర్ ఆది పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో వృద్ధులు, పేదల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుక లు జరిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వాసి సినీ రంగంలో ప్రముఖుడుగా రాణిస్తున్న హైపర్ ఆది పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకొని పేదలకు అన్నదానం నిర్వహించడం మానవత్వంతో కూడిన గొప్ప కార్యక్రమం అని తెలిపారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండవ సుబ్బారావు, ది సేవ్ యానిమల్ ఫౌండేషన్ చైర్మన్ తాడిపర్తి దివ్య శ్రీరాములు, హైపర్ ఆది అభిమానులు పాల్గొన్నారు.

ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట ప్రారంభం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం, తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, నందీశ్వర శిఖర కలశ ధ్వజ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ పూజారి ఎమ్మెల్యేచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పసుపుల మల్లీశ్వరయ్య, కంభం జడ్పిటిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాసులు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి, నిమ్మకాయల శేఖర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన వెంటనే పింఛన్లను పెంచి ప్రతినెలా ఒకటవ తారీఖున ఇంటి వద్ద అందజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సమస్యాత్మకంగా ఉన్న, సంపద సష్టించి యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో కూటమి సర్కార్ పనిచేస్తోందన్నారు. స్కీముల పేరుతో స్కాములు చేసి రాష్ట్రాన్ని దోచిన జగన్మోహన్‌రెడ్డి తెనాలిలో రౌడీషీటర్లను పరామర్శకు రావడం విచారకరమన్నారు. ప్రజలకు సంక్షేమం అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో పలు సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో గత సంవత్సర కాలంగా రూ.10 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అందజేయడం జరిగిందన్నారు. పేదరికం నిర్మూలించడానికి పి-4 పథకాన్ని అమలులోకి తెచ్చి.. ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా అభివద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి సర్కార్ పనిచేస్తుందన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు, 22 ఏ లో ఉన్న భూములపై ప్రత్యేక చర్యలు తీసుకొని పేదలకు అందే విధంగా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. పేదల సంక్షేమమే ఆశయంగా కూటమి సర్కార్ ప్రతి నియోజకవర్గంలో విద్య వైద్య ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా పాలన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

EP No : 66/2024

OS No : 105/2013

ఆవుల ఏగమ్మ ......డి. హెచ్. ఆర్.

మరియు

ఆవుల సరస్వతమ్మ @ సరస్వతి (died) మరియు ఇతరులు ......జె. డి. ఆర్స్.

To

1.నాగునూరి శ్రీదేవి W/o ప్రసాద్ **(జె.డి.ఆర్4)**
2.పసుమర్తి స్వాతి, W/o గణేష్, **(జె.డి.ఆర్7)**
3.ఆవుల ఉమామహేశ్వరి, W/o లేట్ సతీష్ **(జె.డి.ఆర్.8)**

పై జె.డి.ఆర్స్ అందరూ LIG 165, APHB కాలనీ, మామిడిపాలెం, ఒంగోలు, ప్రకాశం జిల్లా నందు నివాసము.

నోటీసు

పై నంబరు ఇ.పి.లో మీరు 4.7 & 8 జె.డి.ఆర్స్ అయిఉన్నారు. మీనోటీసు నిమిత్తము తేదీ.24-06-2025కి వాయిదా అయివున్నది. కావున ఆరోజున ఉదయంగం.10-30 ని.లకు మీరు స్వయముగా కానీ లేదా అడ్వకేటు ద్వారా కాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయటమైనది ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//

తేదీ : 06-06-2025,
ఒంగోలు.

ఇట్లు,
పరుచూరి లక్ష్మీకుమారి
పువ్వాడ సింగయ్య
అడ్వకేట్స్
ఒంగోలు.
Cell: 9948409454

ఊసా వెంకటేశ్వర్లుకు పుత్ర వియోగం

నివాళులర్పించిన నాయకులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిపిఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లుకు పుత్ర వియోగం కలిగింది. ఆయన కుమారుడు హర్షవర్ధన్ (26) గురువారం రాత్రి ఆస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న సిపిఎం జిల్లా నాయకులు హర్షవర్ధన్ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళు లర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, ఎస్‌డి.హనీఫ్, జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, సోమయ్య, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్దయ్య, జాలా అంజయ్య, జిల్లా కమిటీ సభ్యులు టిజి.రంగారావు, కెజి.మస్తాన్, గుమ్మా బాలనాగయ్య, పిసి.కేశవరావు, కె.మాల్యాద్రి, బడుగు వెంకటేశ్వర్లు, రాయల మాలకొండయ్య, వెల్లంపల్లి ఆంజనేయులు, ఉబ్బా ఆదిలక్ష్మి, షేక్ గౌస్‌బాషా, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.షమీమ్, కంకణాల రమాదేవి, మున్వర్, సుల్తానా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతిబాబు, పమిడి వెంకటరావు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, సిపిఎం నాయకులు ఖాదర్‌బాషా, తిరుపతిరెడ్డి, రత్నారెడ్డి, మహేష్, తిప్పారెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు వి.మాలకొండారెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

ప్రజాశక్తి-కొండపి : అనుమానాస్పద స్థితిలో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక టంగుటూరు రోడ్డులోని ఓ వెంచర్‌లో శుక్రవారం వెలుగుచూసింది. మండల పరిధిలోని నెన్నూరు పాడు గ్రామానికి చెందిన చల్లా మధుసూదనరెడ్డి(43) అనే రైతు టంగుటూరు రోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో ఉన్న తాటాకుల గుడిసెలో మృతి చెంది ఉన్నాడు. మృతుడు రెండు రోజుల క్రిందటే చనిపోయి ఉండంతో మృత దేహం ఉబ్బిఉంది. కొండపి ఎస్‌ఐ ప్రేమకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మధుసూదనరెడ్డి గత రెండు రోజులుగా ఇంటికి రాలేదు. ఫోన్ కూడా రింగ్ కావడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో స్థానికులు వెంచర్‌లో మృత దేహం ఉన్నట్లుగా పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం తరలించారు.

ఐదుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి నాగులుప్పలపాడు : లారీ బస్సు ఢీ కొన్న ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఈ ఘటన మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలోని అయ్యప్ప దేవస్థానం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. క్షత గాత్రులను 108 లో ఒంగోలు ఆస్పత్రికి తరలించారు.

పట్టపగలే బైకు చోరీ

ప్రజాశక్తి- సిఎస్‌పురం రూరల్ : పట్టపగలే ఓ బైకు చోరీకి గురైంది. ఈ ఘటన స్థానిక పామూరు రోడ్డులో శు క్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. సిఎస్‌పురానికి చెందిన మేకల రవి బైకును ఆయన స్నేహితుడు గంగోత్రి మిల్క్ డెయిరీ మేనేజర్ నరేష్ తీసుకెళ్లారు. పామూరు రోడ్డులోని గంగోత్రి మిల్క్‌డెయిరీ ఎదుట బైకును పార్క్ చేసి లోనికి వెళ్లాడు. ఐదు నిమిషాల తర్వాత వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. దీంతో సమీప ప్రాంతాల్లోని పరిసర సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. గుర్తుతెలియని యువకుడు బైకును తీసుకెళ్లినట్లుగా కెమెరాల పుటేజీలో నమోదై ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు : లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చీరాల నుంచి ఒంగోలు వైపు అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రాజ్యలక్ష్మి , ఎస్‌ఐ వంశీ నాగులుప్పలపాడు మండలం చదలవాడ వద్ద శుక్రవారం కాపు కాసి రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీని అందులోని రేషన్ బియ్యాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి : బైకును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చీమకుర్తిలోని స్థానిక తూర్పు బైపాస్ జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మేకల దుర్గాప్రసాద్ (23) అనే యువకుడు మృతి చెందాడు. దుర్గాప్రసాద్ ఒంగోలు నుంచి బైకుపై చీమకుర్తికి వస్తున్నాడు. అదే సమయంలో చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సిఐ సుబ్బారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మినీ ఆటో, బైకు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పేర్నమిట్ట చెరువు సమీపంలో ఒంగోలు-కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటన షేక్ సైదాకు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఎమ్మెల్యే బూచేపల్లి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని యర్రఓబనపల్లి గ్రామంలోని శివాలయం, ప్రసన్నాంజనేయ స్వామి, బొడ్డురాయి, పోలేరమ్మ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో ఉప్రోహితుల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ మరియు ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కైపు సుబ్బారెడ్డి, మారం వెంకటరెడ్డి, శ్రీసరస్వతి విద్యాసంస్థల అధినేత ఎవి.రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎండిఎం కార్మికుల సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.యాసిన్ కోరారు. స్థానిక గుజ్జుల యలమందారెడ్డి సార్వక భవనంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రస్తుతం రూ.3000 వేతనం ఇస్తున్నారని, ఈ వేతనాన్ని రూ. 11వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలన్నారు. సిపిఐ కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కలిసికట్టుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కనిగిరి డివిజన్ నాయకురాలు ఎంబాడి పుల్లమ్మ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారం అందించాలి

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

విద్యార్థులకు రుచి కరమైన ఆహారం అందించాలని ఎంఇఒలు టి.రవి, ఇవి.రమణయ్య తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీ చేసే కార్మికులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి పాఠశాలలు పున్ప్రారంభం కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో రుచిగా ఉండేలా భోజనం తయారు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి గ్రంథాలయం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభలో గ్రంథ పాలకుడు అహ్మద్ షరీఫ్ మాట్లాడారు. 40 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతి రోజూ తెలుగు, ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కథలు చదవటం, రాయడం, చదరంగం, క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన, సెమినార్, డస్టర్ గేమ్, లుడో, స్నేక్ అండ్ లాడర్, త్రీ ఇన్ వన్, కబడ్డీ ఆటలు, పాటల పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు గయాజ్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయం వచ్చి గ్రంథాలయంలోని దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు కథలు, నాటకాలు, సైన్స్, గణితం, జనరల్ అవేర్నెస్, జనరల్ నాలెడ్జ్, ఆధ్యాత్మిక, విజ్ఞాన వినోద, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదవాలన్నారు. ఈ పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మస్తాన్ బాబు చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు, పాటిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యార్థులతో గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్

స్టాక్ పాయింట్స్ పరిశీలన

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు స్టాక్ పాయింట్లను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా మండల పరిధిలోని ఉప్పుగుండూరు మార్కెట్ యార్డు గోడౌన్‌ను మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ గోడౌన్‌లో ఎన్నిచెక్కులు నిల్వ చేయవచ్చుననే వివరాలను అడిగి తెసుకున్నారు. ఈ గోడౌన్‌లో సుమారు 20 లారీల సరుకు నిల్వ చేయవచ్చునని అంచనా వేశారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డిఎంను పొగాకు రైతులు కలిసి ఉప్పుగుండూరు మార్కెట్ యార్డులోనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డిఎం మాట్లాడుతూ ప్రస్తుతం తాము స్టాక్ పాయింట్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ వెంకట్రావు, రైతుసంఘం నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గూడౌను పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డిఎం హరికృష్ణ

సంసిద్ధత ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కనిగిరి సెక్టార్‌లో సంసిద్ధ ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఉత్సవాలను సిడిపిఒ సరోజిని ప్రారంభించారు. ఉత్సవాల్లో పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో గ్రో అండ్ అసెస్మెంట్ కార్యక్రమం నిర్వహించి పిల్లల భౌతిక, మానసిక, భౌతిక, భాషా మరియు సామాజిక అభివృద్ధిని పరిశీలించారు. అనంతరం రిపోర్ట్ కార్డులు తల్లుల సమక్షంలో పిల్లలకు అందజేశారు.ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ సంసిద్ధత ఉత్సవాలు నిర్వహించడం వల్ల పిల్లల అభివృద్ధిని సమగ్రంగా అంచనా వేయవచ్చునని తెలిపారు. పిల్లల ఎదుగుదలపై తల్లులకు అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరువైజర్ల సుమతి, పద్మజ, ఐటిసి ప్రతినిధి వెంకటలక్ష్మి,అంగన్‌వాడీలుత తదితరులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే 'మార్క్‌ఫెడ్' నిర్ణయం

రైతు సంఘం నాయకులు తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి - పంగులూరు

నల్లబర్లి పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని, మూడు నెలలుగా రైతు సంఘాలు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం అభినందించ దగ్గ విషయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ రైతు నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. పొగాకు రైతులను తక్షణమే ఆదుకోవాలని కోరారు. స్థానికంగా శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రైతు నేతలు మాట్లాడుతూ నల్లబర్లి పొగాకు కొనుగోలు కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో గత మూడు నెల నుండి అనేక పోరాటాలు చేశామని తెలిపారు. ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు తెలిపామని అన్నారు. రైతులు కూడా రైతు సంఘం పిలుపు మేరకు అనేక పోరాటాల్లో కలిసి వచ్చారని అన్నారు. ఈ పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం చివరికి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొంటామని ప్రకటించటం శుభ పరిణామం అన్నారు. అయితే ఇందుకు కేటాయించిన రూ.350 కోట్లు కేవలం 30 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు మాత్రమే సరిపోతుందని అన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఇటీవల తీసిన లెక్కలు ఉన్నాయని, వాటి ప్రకారం దామాషా పద్ధతిలో మొదటి వలపు పొగాకును కొనుగోలు చేయాలని కోరారు. ఇటీవల మార్టూరులో జరిగిన సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మాట్లాడుతూ మొదటి వలుపులో గ్రేట్ పొగాకును రూ.6వేలకు, రెండు, మూడు వలుపుల పొగాకును రూ.12వేలకు కొనాలని చెప్పారని గుర్తు చేశారు. ఆ ప్రకారం రైతుల వద్ద ఉన్న లో గ్రేడ్ పొగాకు మొత్తం మొదటగా దామాషా పద్ధతిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీల వాళ్ళు కొనగా మిగిలింది మార్క్‌ఫెడ్ ద్వారా కొంటామని అచ్చం నాయుడు చేసిన ప్రకటన రైతులకు ఆందోళన కలిగిస్తుం దని అన్నారు. కంపెనీల వాళ్ళు కొంటారన్న ఆశ రైతుల్లో పోయిందని తెలిపారు. ప్రభుత్వమే విధి విధానాలు త్వరగా ప్రకటించి రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. పొగాకు అమ్ముడు పోక, అప్పుల వాళ్ళు ఇళ్ల చుట్టూ తిరుగుతూ వ్యవసాయ సీజను మళ్ళీ ప్రారంభం కాబోతుండగా చేతిలో చిల్లిగవ్వ లేక రైతుల అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతుల వద్దకు ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేసి, డబ్బు కూడా వెంటనే రైతులకు అందజేయాలని, రైతుల ఇబ్బందులు తీర్చాలని కోరారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని, కందిమళ్ల

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు వెల్లటూరుకు బదిలీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నక్క వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు మండలం లోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. సాధారణ బాదిలీ ల్లో భాగంగా ఆయన వెల్లటూరు ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చినట్లు యుటిఎఫ్ మండల అధ్యక్షులు వి సురేష్ కుమార్ తెలిపారు. మండలంలోని మలవరం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఆయా ప్రాంతాల్లో ఉపాధ్యాయునిగా సేవలందిస్తూ అంచె లంచెలుగా ఎదిగి అతి యుటిఎఫ్‌కు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తూ ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వానికి వారధిగా సమస్యలపై అనేక పోరాటాలు జరిపారని అన్నారు. అలాంటి వ్యక్తి తిరిగి మండలానికి బదిలీ కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు వెంకటేశ్వర్లుకు యూటీఎఫ్ తరపున స్వాగతం అభినందనలు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థి

ప్రజాశక్తి - వేటపాలెం

సాయి విగ్నేష్

ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ ప్రతిఏటా నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ఫైనల్ ఫలితాల్లో బట్ల లలిత్ సాయి విగ్నేష్ ఎంపికయ్యారు. 128 మార్కులు సాధించి జిల్లా 17వ ర్యాంక్ పొందారు. మండలంలో ప్రథమస్థానంలో సాధించాడు. 8వ తరగతి చదివే విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు నగదు అందిస్తారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు, ర్యాంకు పొందిన విద్యార్థి లలిత్‌కు ప్రధానోపాధ్యాయులు తలమల దీప్తి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

నివాళులు అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

సిపిఎం సీనియర్ సభ్యులు బాపూజీ మృతి

ప్రజాశక్తి - చీరాల

సిపిఎం సీనియర్ సభ్యులు కామ్రేడ్ పాదర్తి బాపూజీ (72) గుండె పోటుతో శుక్రవారం మృతి చెందారు. పట్టణంలోని 25వ వార్డు గాంధీనగర్ గౌస్ బేగ్ తోటలో నివాసం ఉంటున్న ఆయన గతంలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యునిగా ఉంటూ వృత్తి దారులు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధ పడుతున్నారు. శుక్రవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు హుటా హుటిగా ఆటోలో ఏరియా వైద్యశాలకు తరించారు. అక్కడ వైద్యులు వైద్య సేవలు అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని స్వగృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, డివిజన్ కార్యదర్శి ఎన్ బాబురావు, సీనియర్ నాయకులు పి కొండయ్య, ఎం వసంతరావు, భగవాన్‌దాస్‌తో కలిసి కామ్రేడ్ బాపూజీ మృతదేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియల్లో కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కామ్రేడ్ బాపూజీ కుమారుడు సాయిరాం డివైఎఫ్ఐ యువజన సంఘం కార్యదర్శిగా బాధ్యతలో ఉన్నారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎన్‌టిఆర్ కాలనీని అభివృద్ధి చేయాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో నూతనంగా ఏర్పడిన పీఎంవై ఎన్‌టిఆర్ నగర్ (పాత జగన్ కాలనీ)లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో అభివృద్ధి చేయాలని, తక్షణం వీధిలైట్లు, మంచినీళ్లు, పారిశుధ్య నిర్వహణతోపాటు నివాసానికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతూ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సిపిఎం ఆధ్వర్యంలో పీఎంవై ఎన్‌టిఆర్ నగర్ అభివృద్ధి కమిటీ ప్రజలు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన మంత్రి సత్యప్రసాద్ మాట్లా డుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని అన్నారు. ఎన్‌టిఆర్ నగర్ కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న లబ్దిదారులు రూ.లక్షలు అప్పు చేసి ఇళ్లు కట్టుకున్నరని మంత్రికి తెలిపారు. రోడ్లు లేవని, వర్షం వస్తే నీళ్ల మధ్యలో పాములతో భయపడుతూ నివాసం ఉండవలసిన పరిస్థితిని మహిళలు మంత్రికి వివరించారు. రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన చాలాచోట్ల కనీస సదుపాయాలు కల్పించలేదని అన్నారు. దీంతో పేదలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణంలో పెద్దసంఖ్యలో ఇల్లు నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్న ఎన్‌టిఆర్ నగర్ అభివృద్ధికి స్థానిక శాసన సభ్యులు, మంత్రివర్యులు బాధ్యత తీసుకుని కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. నివాస ప్రాంతాల్లో అభివృద్ధి కోసం జిల్లాలో రూ.90కోట్లతో ప్రతిపాదనలు పంపారని, రేపల్లె ఎన్‌టిఆర్ నగర్‌కు రూ.35కోట్లతో ప్రతిపాదనలు పంపారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఆర్ నగర్ అభివృద్ధి కమిటీ కన్వీనర్ వి ధనమ్మ, కో కన్వీనర్ కె రవికుమార్, సహాయ కార్యదర్శి కె నాంచారమ్మ, శ్రీనివాసరావు, కె వీరాంజనేయులు, ఎస్‌కె గౌసే పాల్గొన్నారు.

వినతి పత్రం అందిస్తున్న సిపిఎం కార్యదర్శి సిహెచ్ మణిలాల్

పంగులూరు విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి - పంగులూరు

ఎండ్లూరి సుమనశ్రీ

కట్టా హారిక

జిర్రా మణిదీప్‌రెడ్డి

భవనం దివ్య

జిఎంకె సాయిరాం

మండలంలో 2024 - 25 సంవత్సరం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కార అవార్డులకు ఎంపికయ్యారని ఎంఇఒలు కె నాగభూషణం, జి వీరాంజనేయులు శుక్రవారం తెలిపారు. గత మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండ్లూరి సుమన శ్రీ (578), చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కట్టా హారిక (590), జిర్రా మణిదీప్‌రెడ్డి (586), బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవనం దివ్య (585), జి మురళీకృష్ణ సాయిరాం (580) ఎంపికైనట్లు తెలిపారు. వీరికి బాపట్లలో జరుగనున్న కార్యక్రమంలో కలెక్టర్ జెవి మురళి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందించనున్నారని తెలిపారు.

ఆదర్శ విద్యార్థినికి ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - ఇంకొల్లు

షేక్ షబానా

స్థానిక ఆదర్శ హై స్కూల్లో 10వ తరగతి చదివిన విద్యార్థిని షేక్ షబానా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ఆమె 10వ తరగతి ఫలితాల్లో 593 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో 4వ స్థానంలో నిలిచారు. ఈనెల 9న కలెక్టర్ జె వెంకట మురళీకృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకోనున్నట్లు ఆదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. అవార్డుకు ఎంపికైన షబానాను కరస్పాండెంట్ విజయభాస్కర్‌తో పాటు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు

ప్రజాశక్తి - పర్చూరు

వ్యవసాయ సాగునీటి ఎత్తిపోతల పథకాలకు మరమ్మత్తులు నిర్వహించి రైతులకు సాగునీరు అందించే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి చేస్తున్నారని రిటైర్డ్ ఇంజనీర్ ఎంవై సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం పర్చూరు విచ్చేసిన ఆయన రైతులతో కలిసి వెంకటేశ్వర ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంచనా వ్యయాలు తయారుచేసి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆరుతడి పంటలకు నీటి కష్టాలు తీర్చేందుకు ఎమ్మెల్యే సూచనమేరకు అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. పథకం అమలులోకి వస్తే వెయ్యి ఎకరాలకు సాగు నీటి సమస్య తీరుతుందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఆకుల శ్రీనివాసరావు, బుల్లిబాబు, గడ్డిపాటి శ్రీనివాసరావు, తులసి శ్రీనివాసరావు, కోట మధు, తులసి సాంబయ్య, తాటి శ్రీనువాసరావు, మహేష్ పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పరిశీలిస్తున్న రిటైర్డ్ ఇంజనీర్

ప్రతిభా పురస్కారాలకు శాతవాహన విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పర్చూరు

హర్షిత

పునీత్ సాయి

స్థానిక శాతవాహన హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంఇఒ1 సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నల్లగొర్ల హర్షిత 596, తేళ్ల పునీత్ సాయి 592 మార్కులు సాధించారని తెలిపారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఇద్దరు విద్యార్థులు ఈ నెల 9న కలెక్టర్ జెవి మురళి చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలు అందుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తేళ్ల వెంకట రాము

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలి

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేస్తే ప్రజలు గౌరవిస్తారని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు సూచించారు. శుక్రవారంనాడు ఒంగోలు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఎంపిపి పల్లపోలు మల్లికార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో లేవనెత్తిన అంశాలకు సంబందించిన సమస్యలపై తాను రూ 65.5 లక్షలు మంజూరు చేస్తే నేటికీ ఎటువంటి పురోగతి లేదంటే అధికారులు పనిచేస్తున్నట్లా? కాలక్షేపం చేస్తున్నట్లా? అని ప్రశ్నించారు. మాటలతో కాలయాపన చేయకుండా, పదే, పదే చిన్న పిల్లలకు చెప్పినట్లు చెప్పించుకోకుండా తక్షణమే సమస్యలు పరిష్కరించాలని అధికారులు, సిబ్బందిని సున్నితంగా మందలించారు. కనీసం రోజుకు నాలుగైదు గంటలయినా గ్రామాల్లో పనిచేస్తే మా కంటే మీకే ఎక్కువ గౌరవం దక్కుతుందన్నారు. తహసీల్దార్, ఎంపిడిఒ లు రోజూ ఒక గ్రామం చొప్పున కేంపులు నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న రెవిన్యూ, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. అన్ని గ్రామాల్లోని జగనన్న కాలనీలు రీ సర్వే చేయాలని తహసీల్దార్, ఎంపిడిఒలు టీంగా ఏర్పడి ఆయా కాలనీలగురించి సమగ్రమైన రిపోర్ట్ నెల రోజుల్లో అందజేయాలని ఆదేశించారు. వలేటివారిపాలెం సెక్రటరీ పై భౌతికదాడికి పాల్పడిన సర్పంచ్ భర్త పై చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి పోలీస్ అధికారులతో మాట్లాడామన్నారు. ఆ పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దుకు సిఫార్సు చేయాలని ఎంపిడిఒకు సూచించారు. ఇటువంటి అనైతిక చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఎంపిడిఒ కె రాజశేఖర్ రావు మాట్లాడుతూ 0 నుంచి ఆరేళ్ళ లోపు పిల్లల ఆధార్ నమోదుకు సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు, పుట్టిన తేదీకోసం భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా ఆధార్ నమోదుకు సచివాలయ సెక్రటరీలు, మహిళా పోలీసులు గ్రామాల్లో చొరవ చూపాలని కోరారు. రూరల్ తహసీల్దార్ షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ రేషన్ అందనివారు ఫిర్యాదు చేస్తే రేషన్ అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి బసవ శంకరరావు, ఇఒఆర్ డి చెన్నయ్య, ఫిషరీస్ అధికారి ఆషా, వ్యవసాయ అధికారి కిషోర్, ఏపిఒ బి నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్ లు, ఎంపిటిసి లు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రాలు తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు నగరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను బీసీ కార్పొరేషన్ ఎగ్జికూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం నాడు తనిఖీలు గావించారు. నగరంలోని అన్నవరప్పాడు, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్న కేంద్రాలలో ఆయన పరిశీలించారు. సుమారు 3 నెలలుగా చేపట్టిన శిక్షణపై, ఆయన సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు ఈ కాలంలో కుట్టిన దుస్తులు పరిశీలించి మెరుగైన ఉపాధి పొందాలని సూచించారు.

బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

త్యాగానికి, సహనానికి ప్రతీక బక్రీద్ అని, మత, మానవతా విలువలకు ప్రతిబింబంగా నిలిచే ఈద్ మిల్లాదునబి (బక్రీద్) ప్రజలందరిలో ఐక్యతా, సమానతా భావాలను మరింతగా పెంపొందించాలి కోరుకుంటున్నానని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వయో వృద్ధులు మరియు దివ్యాంగుల సంక్షేమం, గ్రామ వార్డు సచివాలయాలు మరియు వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఒక్కరికి ఆనందం, శాంతి, ఆరోగ్యాన్ని అందించాలని ఆకాంక్షించారు.

ఒంగోలు కలెక్టరేట్: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లింలకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలకు ముఖ్యమైన పండుగలలో రెండవది బక్రీద్. పేదలకు దానధర్మాలు, భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మత సామరస్యాన్ని చాటిచెప్పాలి

- బక్రీద్ సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు - ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్పీ తుషార్ డూడి

సర్వమత సమ్మేళనమైన భారతదేశంలో ఒకరి మనోభావాలను మరొకరు గౌరవిస్తూ మత సామరస్యాన్ని చాటి చెప్పాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ శుక్రవారం ముస్లిం సోదర, సోదరీమణులకు, బక్రీద్ పర్వదినాన్ని జరుకొనే పోలీస్ సిబ్బందికి, పాత్రికేయులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. త్యాగానికి ప్రతీక అయిన ఈద్ అల్ అధా (బక్రీద్ పర్వదినాన్ని) శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లను జిల్లా పోలీస్ యంత్రాంగం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలను తీసుకున్నామన్నారు. ఇప్పటికే ముస్లిం, ఇతర మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. భద్రత మరింత బలోపేతం చేయడంలో భాగంగా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లను నిఘా కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సోషల్‌మీడియా ఇతర డిజిటల్ మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరు వ్యాఖ్యానించినా, వదంతులు వ్యాపింపజేసినా వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వ మత సమ్మేళనమైన భారతదేశంలో అన్ని మతాల ఆచారాలు, సంప్రదాయాలను గౌరవించాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా, వదంతులను వ్యాపింపజేస్తున్నట్లు సమాచారం తెలిసిన సంబంధిత పోలీస్ అధికారులకు లేదా టోల్‌ఫ్రీ నెంబర్లు 112, 100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

'నవోదయ' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

శివరాం

ఒంగోలు పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ 2026-27వ విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న (2025-26) విద్యార్థులనుండి నవోదయ విద్యాలయ సమితి వెబ్ సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాలను ఆన్ లైన్ ద్వారా మాత్రమే ఐదోతరగతి చదువుచున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధవపరచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలను అప్‌లోడ్ చేసేందుకు మొబైల్, లాప్‌టాప్ టాబ్లెట్ మొదలగు వాటిని ఉపయోగించుకోవచ్చన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 29 మండలాలకు చెందిన ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటి వారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, శింగరాయ కొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండెపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కోరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాంకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసేటప్పుడు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుండి డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారంలో పొందుపరచిన నియమాలను విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించి అప్లోడ్ చేయాలన్నారు. 3 వ తరగతి (2023-2024) 4వ తరగతి (2024-2025),5 వ తరగతి 2025-2026,ప్రభుత్వ, ప్రభుత్వముచే గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణత పొంది ఉండాలని తెలిపారు 2014 మే 1 నుంచి 2016 జులై, 31 మధ్య జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. దరఖాస్తులు జులై 29 లోగా పంపుకోవాలని, డిసెంబర్ 13 న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

యోగాతో మానసిక సమతుల్యత

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

యోగా వల్ల ఆరోగ్యం, మానసిక సమతుల్యత మెరుగుపడుతుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో బాపట్ల మండలం, నగరవనంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని.. యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న విశాఖపట్నం ఆర్కే బీచ్ నుండి శ్రీకాకుళం వరకు 5 లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా వస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఈ నెలను యోగా మహోత్సవంగా జరుపుకుంటున్నామని, దానికి యోగాంధ్ర అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. జూన్ 21న రామాపురం బీచ్ మరియు సూర్యలంక బీచ్ లో పెద్ద ఎత్తున వేలాది మందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.గంగాధర్ గౌడ్, డిఆర్‌డిఎ పిడి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, జిల్లా అధికారులు, ఎన్‌సిసి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 7, 8 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. ఈ నెల 8వ తేదీ ఉదయం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలో బెల్లం నిర్మల, సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగే పోలేరమ్మ తల్లి కొలుపులు కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు ఒంగోలు మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

పొగాకు కొనుగోళ్లకు

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

వైసిపి ఒంగోలు సమన్వయకర్త చుండూరు రవిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు కొనుగోళ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయ కర్త చుండూరు రవిబాబు రైతులకు సూచించారు. శుక్రవారం నాడు ఒంగోలు-2 (త్రోవగుంట) వేలం కేంద్రాన్ని ఆ పార్టీ నాయకులతో కలసి సందర్శించారు. వేలం నిర్వహణ, మార్కెట్ ధర, కొనుగోళ్ల ప్రక్రియ తదితర విషయాలపై బోర్డు పరిధిలోని పోతవరం,యరజర్ల, వెంగముక్కపాలెం, సర్వేరెడ్డిపాలెం, చెరువుకొమ్ముపాలెం తదితర గ్రామాల రైతులు, వేలం నిర్వహణ అధికారి జె.తులసితో మాట్లాడారు. రోజురోజుకూ ధరలు దిగజారిపోవడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బోర్డు అధికారులను, కంపెనీలను బతిమాలితే ధర పెంచరని, రైతులు ఐక్యం అయ్యి వేలం నిలిపివేస్తేనో, నిరసన వ్యక్తం చేస్తే గానీ ప్రభుత్వం గానీ, బయ్యర్లు గానీ దిగి రారని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులను దగా చేస్తుందని విమర్శించారు. రైతుల పక్షాన కంపెనీలతో చర్చించి గిట్టుబాటు ధర కల్పించవలసిన ప్రభుత్వం చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. బోర్డు అధికారులు సైతం కంపెనీలకు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. సన్న, చిన్న కారు రైతులను కంపెనీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. లో గ్రేడ్ పేరుతో ధరలను కిలో రూ.180కు దిగజార్చడం, నిరాకరించడం పట్ల అక్షేపణ వ్యక్తం చేశారు. అదేమంటే కంపెనీలకు ఆర్డర్లు రాలేదని రైతులను మభ్యపెడుతున్నట్లు ఆరోపించారు. వాస్తవానికి మే మొదటి వారానికే ఆర్డర్లు వచ్చాయని, అగ్రిమెంట్లు కూడా అయ్యాయని పేర్కొన్నారు. గత సంవత్సరం గణనీయమైన లాభాలు చవిచూసిన కంపెనీలు అధిక సాగు పేరున రైతులను మభ్యపెట్టి ధర తగ్గించేందుకు సిండికేట్ అయ్యాయని విమర్శించారు. బోర్డు అధికారులు కంపెనీల వైపు వాకాల్తా పుచ్చుకుని రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతుల పక్షం వహించవలసిన ఫ్లోర్ లీడర్లు తమ పొగాకు అమ్మేసుకుని, స్వలాభం చూసుకుంటూ తక్కువ ధరకు అమ్ముకునేలా రైతులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ బర్లీ పొగాకుకు నిధులు కేటాయించినట్లు వర్జినియా పొగాకు కొనుగోలుకు నిధులు కేటాయించి మార్క్ ఫెడ్ వంటి ప్రభుత్వ సంస్థలచే కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతుల స్థితిగతులు పరిశీలించి గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తమ నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలో జిల్లా కు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి రమణా రెడ్డి, వైసిపి కొత్తపట్నం మండల అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండలం అధ్యక్షులు మన్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న చుండూరి రవిబాబు

పని గంటలు పెంచుతూ మంత్రివర్గ నిర్ణయం దుర్మార్గం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్

ప్రజాశక్తి - బాపట్ల

కార్మిక వర్గానికి నష్టదాయకంగా కార్మిక చట్టాలు మారుస్తూ రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొస్తూ ప్రకటన చేయటం సరైన పద్ధతి కాదని అన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని హక్కును ఇకపై 12 గంటల పని విధానంగా అమలు చేస్తామనడం దుర్మార్గం అన్నారు. ఇది పెట్టుబడిదారులు లాభాలు పెంచుకోవడానికి కార్మికులను దోచుకోవటానికి మార్గమని విమర్శించారు. రాష్ట్రంలో 50లక్షలపైగా కార్మికులు పనిచేస్తున్న షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో 13 ఏళ్లగా కనీస వేతన సవరణ జరగలేదని తెలిపారు. కనీస వేతనాల బోర్డు నియమించలేదని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే దాని పునరుద్ధరణకు పూనుకోలేదని అన్నారు. అటువంటి వాటిపై చర్చించకుండా కార్మికుల పని విధానాన్ని 8గంటల నుండి 12 గంటలకు మార్పు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలను రాత్రిపూట పనిచేయటానికి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కూడా సరైన చర్య కాదని, మహిళలకు భద్రత కల్పించాల్సి ఉందని అన్నారు. మహిళలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. రాత్రిపూట మహిళలు పని చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం అంటే మహిళా కార్మికుల శ్రమను దోచుకోవడమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటల విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే అమలు జరిగితే ఇప్పుటి దాకా కార్మికులు పని చేస్తున్న మూడు షిఫ్టుల విధానం రద్దయి రెండు షిఫ్టులుగా వస్తుందని, ఇప్పటికే ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్తంగా సమ్మెలో చేయనున్నట్లు తెలిపారు. ఈ దుర్మార్గ విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

విద్యామిత్ర కిట్ రికార్డు పరిశీలిస్తున్న జెడి గంగాభవాని

విద్యామిత్ర కిట్ పరిశీలన

ప్రజాశక్తి - వేటపాలెం

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం జాయింట్ డైరెక్టర్ ఆర్ఎస్ గంగాభవాని శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలోని యూనిఫార్మ్, బ్యాగ్స్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె తోపాటు బాపట్ల సిఎంఓ శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ2 ఐ పురుషోత్తం, సిఆర్‌పి గొర్రె హరినారాయణ పాల్గొన్నారు.

నర్సరీ ప్రారంభిస్తున్న ఎఎంసి ఛైర్మన్ తేలప్రోలు రమేష్

నర్సరీ ప్రారంభం

ప్రజాశక్తి - సంతమాగులూరు

రైతులకు అందుబాటులో ఉండే విధంగా నర్సరీలను యాజమాన్య పద్ధతులతో పెంచాలని ఎఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్ తెలిపారు. బల్లికురవ మండలంలోని రామాంజనేయపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ స్వాతి మొక్కల పెంపకం నర్సరీని ఆయన శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ నర్సరీలో అధిక దిగుబడినిచ్చే టమేటా, వంగ రకాల మొక్కలను పెంచడానికి ముందుకొచ్చి ఏర్పాటు చేసిన తూపూరి సాంబశివరావు అభినందనీయులని అన్నారు. కూరగాయల విత్తనాలతోపాటు ఇతర పండ్ల మొక్కల పెంపకం కోసం రైతులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గోరంట్ల ఎల్లమంద, మెడికల్ శ్రీను, గొట్టిపాటి శేషయ్య పాల్గొన్నారు.

ఎఎంసి ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి, గంగాధర్

8న ఎఎంసి ఛైర్మన్ గొట్టిపాటి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - వేమూరు

ఈనెల 8న సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతన మార్కెటింగ్ యార్డు కమిటీ ఛైర్మన్‌గా గొట్టిపాటి పూర్ణ కుమారి గగాధర్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు శాసన సభ్యుల క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్, రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, లోకసభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - రేపల్లె

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసిన సురక్ష హాస్పిటల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. పట్టణంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన హాస్పిటల్ ఏర్పాటు కావడం అభినందనీయం అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఈ హాస్పిటల్ ద్వారా అందుతాయని అన్నారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ సురక్ష హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, పల్మనాలజీ జనరల్ మెడిసిన్‌లో చికిత్సలు అందించడంతోపాటు షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య నిపుణులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

యోగాపై మండల స్థాయి పోటీలు

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక ఎమ్మార్సీ సమావేశం హాల్లో యోగపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు మండల స్థాయిలో వ్యాస రచన, చిత్ర లేఖనం, పాటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. పోటీలను ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ ప్రారంభించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారని చెప్పారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు వివరించారు. రోజువారీ జీవితంలో యోగా అలవాటు చేసుకుంటే అనేక ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఈఒ పిఆర్డి కె సత్యనారాయణ, యోగ మాస్టర్ ట్రైనర్, మండల పర్యవేక్షణ అధికారి, ఉప్పుటూరు హెూమియోపతి డాక్టర్ డి చంద్రశేఖర్, నూతలపాడు ఆయుర్వేదిక్ డాక్టర్ బి శ్రీనివాసరావు, విఆర్ఓ వై శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ ఉదయ భాస్కరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు పాల్గొన్నారు.

యంత్రాలతో ఘన వ్యర్థాల నిర్వహణ

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో సేకరించే వ్యర్థాల ద్వారా ఎరువు తయారు చేసి ప్రజలకు అందించే విధంగా అనేక పథకాలను ప్రభుత్వం రూపొందించిందని కమిషనర్ బి రవీంద్ర అన్నారు. తరుణి అసోసియేట్స్ ఆధ్వర్యంలో అద్దంకి కొండ ప్రాంతంలోని చెత్త డంపింగ్ కేంద్రాన్ని అసోసియేట్ అధికారులతో పాటు కమిషనర్, ఏఈ, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ కేంద్రానికి భారీ యంత్రాన్ని తీసుకువచ్చి కేంద్రంలోని చెత్త వ్యర్థాలను వేరుచేశారు. మిగిలిన ఎరువు లాంటి పదార్థాలను రైతులకు తరుణి అసోసియేట్స్ అందిస్తుందని తెలిపారు. చెత్తా, చెదారాలు, పీచు పదార్థాలు, ఇతర వస్తువులను గుంటూరు సమీపంలో జిందాల్ ఫ్యాక్టరీకి అందించనున్నట్లు తెలిపారు. 9 క్లస్టర్ల పరిధిలో చెత్త డంపింగ్ కేంద్రంలోని వ్యర్థర్థాలను వేరుపరచి ఇతర కేంద్రాలకు అందించనున్నట్లు తరుణ్ అసోసియేట్స్ ప్రతినిధులు తెలిపారు. అద్దంకి డంపింగ్ కేంద్రంలో 58వేల టన్నుల వ్యర్థ పదార్థాలు ఉన్నాయని అన్నారు. వీటన్నింటినీ వివిధ రకాలుగా వేరుచేసి ఆదాయ వనరుగా మార్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఈ లోకేష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలు వేరు చేసే యంత్రాలు ప్రారంభిస్తున్న దృశ్యం

సంతమాగులూరులో ర్యాలి నిర్వహిస్తున్న దృశ్యం

సంతమాగులూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీపుల్స్ అవగాహన, సభలు మండలంలోని 20 పంచాయితీల్లో శుక్రవారం జరిగాయి. సంతమాగులూరు సర్పంచి పుచ్చకాయల నాగేశ్వరావు, సిబ్బంది, ఎంపీటీసీలు గ్రామసభ అనంతరం యోగాంధ్ర అవగాహన ర్యాలి ఎంపిడిఒ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు నిర్వహించారు. గ్రామ సభలను ఉద్దేశించి ఎంపిడిఒ జ్యోతిర్మయి మాట్లాడుతూ అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు చేపట్టనున్నట్లు తెలిపారు. సంపద అధికంగా ఉన్న కుటుంబాలు, అట్టడుగున ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబంగా నమోదు చేసి వారికి మార్గదర్శులు ఏర్పాటు చేసి గ్రామ సభ ద్వారా వారిద్దరి మధ్య సమన్వయం ఏర్పరచడమే ఉద్దేశం అన్నారు. గ్రామీణ ప్రజలకు కూడా యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు వివరించాలని చెప్పారు. వారి జీవన విధానంలో వ్యాయామం భాగంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఒ పిఆర్ డి రాంప్రసాద్ పాల్గొన్నారు.

వికలాంగుల హక్కుల చట్టం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చిన చీరాల డిఎస్పి ఎండి మొయిన్, రూరల్ సిఐ పి శేషగిరిరావు, ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 పోస్టర్, పుస్తకావిష్కరణ శుక్రవారం చేశారు. చీరాల డివిజన్ పరిధిలోని ప్రతి పోలీసు స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల చట్టం విధిగా అమలు చేయాలని, సెక్షన్ 92 (ఎ) ప్రకారం దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని కోరారు. స్పందించిన డిఎస్పి తన పరిధిలోని పోలీసు స్టేషన్లలో దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా, గుడిపాటి రవితేజ, కొండలు ఉన్నారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న డిఎస్పి ఎండి మోయిన్

మహిళ హత్య కేసులో ఇద్దరు అరెస్టు

• వివరాలు వెల్లడించిన డిఎస్పి మహమ్మద్ మోయిన్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. హత్యకు పాల్పడిన ఇద్దరు ముద్దాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలు చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్ వెల్లడించారు. మండలంలోని రామన్నపేట పంచాయతీ వినాయకపురంకు చెందిన మానికల దీపిక (24) హత్యకు గురైనట్లు తెలిపారు. మృతురాలి పుట్టింటి పేరు వేటగిరి ప్రమీల. మృతురాలుకు ఏడేళ్ల క్రితం వినాయకపురంకు చెందిన మానికల ఏడుకొండలుతో వివాహం జరిగినది. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. నాలుగేళ్ల క్రితం మృతురాలు భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రానందున మృతురాలి భర్త పురుగుమందు తాగి చనిపోయాడు. అప్పటి నుండి మృతురాలు తన అత్త వద్ద ఉంటున్నది. మృతురాలు చెడు అలవాట్లకు అలవాటు పడి బీరు తాగటం, సిగిరెట్ తాగటం, ఇంట్లో చెప్పకుండా వెళ్ళటం, ఇంటికి ఎప్పుడో రావటం చేస్తూ ఉంటుందని పోలీసు విచారణలో తేలినట్లు తెలిపారు. ఈగ వెంకటేశ్వరరావు, సైకం నాగబాబుకు స్వయానా బావ అవుతాడు. వెంకటేశ్వరరావు భార్య సౌందర్యను సైకం నాగబాబుకు ఇచ్చి పెళ్లి చేశారు. సైకం నాగాబాబు పందిళ్లపల్లిలో ఒక మామిడి తోటకు కాపలాగా తోటలో ఒక రేకుల షెడ్డులో భార్య పిల్లలతో ఉంటున్నాడు. నిజాంపట్నం మండలం దారేసుపాలెంకు చెందిన ఈగ వెంకటేశ్వరరావు ఎనిమిదేళ్ల క్రితం రామన్నపేట పంచాయతి వినాయకపురం వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వినాయకపురంకు చెందిన మృతురాలు

వివరాలు వెల్లడిస్తున్న చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్

మానికల దీపిక అలియాస్ వేటగిరి ప్రమీలతో పరిచయం పెంచుకుని ఆమెతో చనువుగా తిరుగుతూ ఉండేవాడు. తరువాత తన ఇంటి దగ్గరలో ఉంటున్న కొమరగిరి రాములమ్మ అను ఆమెని 2వ భార్యగా వివాహం చేసుకున్నాడు. ఆ తరువాత మృతురాలు సైకం నాగబాబుతో పరిచయం పెంచుకుని అతనితో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను పెళ్లి చేసుకోమని వత్తిడి చేయడమే కాకుండా పెళ్లి చేసుకోకపోతే నాగబాబును అతని భార్యతో కాపురం చెయ్యనివ్వనని బెదిరిస్తూ ఉంటుందని తెలిపారు మృతురాలు తన కాలనీలోని వారితో కూడా అదేవిధంగా చెప్తూ ఉండగా ముద్దాయిలు ఇద్దరూ మృతురాలిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని అనుకుని గత ఏప్రిల్ 30న రాత్రి ముద్దాయిలు ఇద్దరూ మృతురాలిని బీరు తాగాదామని పిలిచి పందిళ్లపల్లి, తిమ్మసముద్రం రోడ్డులో మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని వెళ్లి దారిలో పడిఉన్న ఒక ఫ్లెక్సీ బ్యానర్ తీసుకుని ముసలమ్మ కాలువ గట్టుమీదగా వెళ్లి పలవాల శివరాం పొలంలో మృతురాలి చేత బీరు తాగించి, ముద్దాయిలు ఇద్దరూ మృతురాలి చున్నీని మెడ చుట్టూ చుట్టి గట్టిగా లాగి హత్య చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఫ్లెక్సీ బ్యానర్‌లో చుట్టి, మృతురాలి బట్టలతోనే కట్టి మృతదేహాన్ని తీసుకు వచ్చి ఆ అర్ధరాత్రి న్యూ రోశయ్య కాలనీకి పడమరవైపున ఖాళీ పొలాల్లో గొయ్యి తవ్వి పూడ్చిపెట్టినట్లు తెలిపారు. మృతురాలి అత్త మానికల పద్మ పోలీసులకు ఇచ్చిన పిర్యాదు ఆధారంగా ఈనెల 1న ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారించినట్లు తెలిపారు. ఈ కేసు ప్రాధాన్యత దృష్ట్యా తదుపరి దర్యాప్తును చీరాల రూరల్ సీఐకి అప్పగించగా ఆయన దర్యాప్తు చేసి అనుమానితులుగా ఉన్న ముద్దాయిలను శుక్రవారం ఉదయం అదుపులోనికి తీసుకుని విచారించినట్లు తెలిపారు. ముద్దాయిలు తాము చేసిన నేరం ఒప్పుకుని మృతురాలిని పూడ్చి పెట్టిన ప్రదేశాన్ని చూపించినట్లు తెలిపారు. ఆ ప్రదేశంలో తహశీల్దారు, చీరాల ఏరియా హాస్పిటల్ డాక్టర్ల సమక్షంలో తవ్వించగా మృతదేహం కుళ్ళిన స్థితిలో బయటపడింది. మృతురాలి కుడి ముంజేతిపై ఉన్న పచ్చ బొట్టు, మృతురాలి కుడి కాలు నాల్గవ వేలు మిగతా వేళ్ళ కంటే పైకి ఉండుట వలన మృతురాలి తల్లి, ఇతర బంధువులు మృతురాలిని గుర్తు పట్టినట్లు తెలిపారు. చీరాల ఏరియా హాస్పిటల్ డాక్టర్ లు పోస్టుమార్టం చేసినారు. ఉమెన్ మిస్సింగ్ కేసును హత్యా కేసుగా మార్చి ముద్దాయిలు ఇద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా చేధించిన రూరల్ సీఐ పీ శేషగిరిరావు, ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుళ్లు బి అచ్చయ్య, తన్నీరు శ్రీను, పి నరసింహారావు, ఎస్‌కె బాజీత్, పిసీ బాలచంద్రను ఎస్పీ తుషార్ దూడి, చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్ అభినందిచారు.

మంత్రి గొట్టిపాటి బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

సమాజ హితం కోసం అల్లాహ్ ఆజ్ఞ మేరకు మహ్మద్ ప్రకవక్త తన ప్రియ కుమారుల్లో ఒకరిని త్యాగం చేయడానికి సిద్ధపడగా ఆ త్యాగాన్ని స్మరిస్తూ జరుపుకునే పండుగే ఈద్ – అల్ – అదాని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసం కలిగి సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ చాటుతుందని తెలిపారు. తమకున్న దాంట్లో ఇతరులకు కొంత పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తి సూత్రంతో సంతోషకరంగా ముస్లిం సోదరులంతా కుటుంబ సమేతంగా పండుగ జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని బూదవాడలో ఈనెల 7న శనివారం గొట్టిపాటి యువసేన సారధ్యంలో చెరుకూరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని యువసేన నిర్వాహకులు చెప్పారు. ఈ శిబిరం బూదవాడ హైస్కూలు ఆవరణలో జరుగుతుందని చెప్పారు. శిబిరంలో ఎముకలు స్పెషలిస్ట్ డాక్టర్ టి వెంకటేష్, కంటి చికిత్స స్పెషలిస్ట్ ముద్దన సతీష్ కుమార్, చిన్నపిల్లల స్పెషలిస్ట్ చిలుకూరి భువన, షుగరు, జనరల్ వైద్యులు డాక్టర్ జి అమూల్య పాల్గొంటారని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఈసీజీ, రక్త పరీక్షలు, షుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. మందులు కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

మద్యం మత్తులో దాడి

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని మరియమ్మపేటకు చెందిన ఉదయ్ భాస్కర్, లక్ష్మీపురంకు చెందిన మల్లి రాజేష్ ఇద్దరు మద్యం దుకాణం వద్ద ఒకరితో ఒకరు ఘర్షణ పడ్డారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఇరువురు మద్యం సీసాలతో దాడి చేసుకోవటంతో ఇరువురుకి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్య సేవలు అందించిన వైద్యులు ఇరువురికీ మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. సమాచారం అందుకున్న అవుట్ పోస్ట్ పోలీసులు ఇరువురి వద్ద వివరాలు సేకరించారు. ఇరువురి పిర్యాదులు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో లంకభూముల కాల్వపై వంతెన

• అవస్థలు పడుతున్న గంగడిపాలెం ప్రజలు • నూతన వంతెన నిర్మించాలిన కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి - రేపల్లె

శిథిలవస్థకి చేరిన నడకదారి వంతెన తొలగించి ట్రాక్టర్లు వెళ్లే విధంగా నూతన వంతెన నిర్మించాలని గంగడిపాలెం ప్రజలు కోరుతున్నారు. మండలంలోని గంగడిపాలెంలో లంక భూములకు వెళ్లి వరి సాగు చేసే రైతులు, ఆక్వా రైతులు, కృష్ణ నదిలో చేపలు పట్టుకుని జీవనం సాగించే మత్స్యకారులు, గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశానానికి తీసుకువెళ్లేందుకు ఉన్న వంతెనే స్లాబ్ కూలిపోవడంతో ఆయా వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వంతెన రహదారి లేక కాలువ దాటడానికి అనేక అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1999లో అప్పటి ప్రభుత్వం, బాపట్ల ఎంపి దగ్గుపాటి రామానాయుడు ఈ కాలువపై నిర్మించిన వంతెన నేటి వరకు కాలిబాటగా గంగడిపాలెం ప్రజలు ఉపయోగించుకున్నారు. ఒక్కసారిగా వంతెన మధ్యలో స్లాబ్

శిథిలావస్థలో ఉన్న లంకభూముల కాలి వంతెన

కుప్పకూలడంతో ప్రతిరోజు లంక భూములకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని శిథిలావస్థలో ఉన్న కాలినడకన వంతెనను తొలగించి దాని స్థానంలో ట్రాక్టర్ల వంటి వ్యవసాయ, సాంకేతిక వాహనాలు వెళ్లే పెద్ద వంతెన ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంతున్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పాదచారులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక బొమ్మలు సెంటర్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ, పాయసం శుక్రవారం పంపిణీ చేశారు. బక్రీద్ సందర్భంగా పర్చూరుకు చెందిన పాత్రికేయుడు భాష అందించిన సహకారంతో ఏర్పాటు చేశారు. రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు జి శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాసరావు, పి వెంకన్న పాల్గొన్నారు.

'పి-4 ద్వారా బంగారు కుటుంబాలు'

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆర్థికంగా వెనుకబడిన వారి అభివృద్ధికి పి4 బంగారు కుటుంబ కార్యక్రమం తోడ్పడుతుందని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పి4 పథకం ద్వారా గ్రామాల్లో వెనుకబడిన వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించి వారి ఆర్థిక ప్రగ తికి చేయూత నిచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పి4 బంగారు కుటుంబాల లబ్ధిదారులు, వారి మార్గదర్శకులతో సమన్వయ సమావేశాలు శుక్రవారం నిర్వహించారు. చెరుకుపల్లి, తుమ్మలపాలెంలో ఎంపిడిఒ, పొన్నపల్లిలో తహశీల్దారు, కావూరులో డిప్యూటీ తహశీల్దారు, చెరుకుపల్లి, గుల్లపల్లిలో డిప్యూటీ ఎంపిడిఒ, ఆరుంబాక, రాంబట్లపాలెంలో ఎపిఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సచివాలయాల వద్ద సమన్వయ సమావేశాలు నిర్వహించారు. 2200 మంది పి4 బంగారు కుటుంబాల లబ్ధిదారులను ఎంపిక చేయగా 91మంది మార్గదర్శకులను ఎంపిక చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. సమావేశాల్లో తహశీల్దారు సిహెచ్ పద్మావతి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న సీతారామయ్య కుటుంబ సభ్యులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన కృష్ణంశెట్టి బోడెమ్మ 22వ వర్ధంతి సందర్భంగా ఆమె పెంపుడు కుమారుడు కారుమూరి సీతారామయ్య వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధ ఆశ్రమం నిర్వాహకులు, వృద్ధులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె శ్రీనివాసరావు, సీతారామయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు పంచాయతీలో 2019 – 24 మధ్య జరిగిన ఆర్థిక అవకతవకల కారణంగా ఇప్పటికీ నలుగురు పంచాయతీ కార్యదర్శులు, ఇరువురు జూనియర్ అసిస్టెంట్లు సస్పెన్షన్‌కు గురైన సంగతి పాఠకులకు విధితమే. దీనిలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు శుక్రవారం మరో సారి పంచాయతీని పరిశీలించి పలు అంశాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పంచాయతీలోని కొన్ని ముఖ్యమైన రికార్డులు, ఎం బుక్ రికార్డులను స్వాధీనం చేసుకుని బాపట్లకు తరలించారు. ఈ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఈపాటికే సస్పెన్షన్‌కు గురైన వారితో పాటు ఇంకా ఎంతమంది ప్రమేయం ఉందనే అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకొని ఉన్నట్లు తెలిసింది. ఆయనతో పాటు ఈపాటికే భట్టిప్రోలు నుండి బదిలీ అయిన పిఓపిఆర్డి ఊహారాణి, ప్రస్తుత ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఐలవరం పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు ఉన్నారు.

ఎపిసేవ పోర్టల్ సేవలకు అంతరాయం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఎపి సేవా పోర్టల్ సేవలకు నాలుగు రోజుల అంతరాయం ఏర్పడుతుందని ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. ఎపి సేవా పోర్టల్‌ను నిర్వహిస్తున్న మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు జరుగుతున్నందున శనివారం ఉదయం నుండి మంగళవారం రాత్రి వరకు వివిధ రకాల సేవలు నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ఆదాయ ధ్రువకరణ, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పట్టాలు, వృద్ధాప్య ధ్రువీకరణ కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, వాటర్ టాక్స్, పట్టణ పరిపాలన సేవలు, మత్స్య శాఖ సేవలు మినహా మిగిలిన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బుధవారం నుండి యధావిధిగా సేవలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు శుక్రవారం పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు డిఇఒ ఎస్ పురుషోత్తం తెలిపారు. కలెక్టర్ జెవి మురళి ఆద్వర్యంలో జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొలిరోజు పరీక్షకు 451 అభ్యర్థులు హాజరు కాగా 92 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరులోని చిన్నరేవు పక్కనున్న హిందూ స్మశాన వాటిక సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ ఎం శివయ్య తెలిపారు. మృతుడు యాచకునిగా ఉన్నట్లు ఆధారాలు లభించాయని, సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన ఈ వ్యక్తని తెలిపారు. బంధువులు గుర్తించి సమాచారాన్ని పోలీసులకు తెలియపర్చాలని కోరారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మారడం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరయ్యచౌదరి హత్యకేసులో
మరో ఇద్దరు అరెస్టు
రిమాండ్ విధించిన కోర్టు..

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఒంగోలులో టిడిపి నేత ముప్పవరపు వీరయ్య చౌదరిని కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి చంపిన కేసులోని మరో ఇద్దరు నిందితులను శుక్రవారం త్రోవగుంట వద్ద ఒంగోలు డి.ఎస్.పి ఆర్.శ్రీనివాసరావు అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. అరెస్టయిన వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓబిలి నాగరాజు, నెల్లూరు జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం మండలం, చల్లాయపాలెంకు చెందిన గోళ్ల రుత్యేంద్రబాబు ఉరఫ్ నాని ఉన్నారు. రుత్యేంద్రబాబుపై గతంలో రౌడీషీట్, పలు కేసులు, కిరాయి హత్య కేసులు కూడా ఉన్నాయి.

'అశోక్‌బాబు'ని సన్మానిస్తున్న ఎస్పీ, పోలీసు అధికారులు

'అశోక్‌బాబు'కి ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయి జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలో అదనపు ఎస్‌పిగా ఉన్న ఎంఎస్ఎస్ అశోక్ బాబు ఏఆర్ నాన్ క్యాడర్ ఎస్‌పిగా పదోన్నతి పొందారు. సాధారణ బదిలీలలో భాగంగా మంగళగిరి పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌కి బదిలీ అవుతున్న అశోక్ బాబుకి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. నాన్ క్యాడర్ ఎస్‌పి ఎంఎస్ఎస్ అశోక్ బాబుకు జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ శాలువా కప్పి సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మహిళ డిఎస్‌పి రమణ కుమార్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, మహిళా పియస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ ఎం. శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ విజయకృష్ణ, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

'రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యం'పై విచారణ

ప్రజాశక్తి-మద్దిపాడు

బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

మండల కేంద్రమైన మద్దిపాడులోని రైస్ మిల్లుల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని అధికారులు గురువారం అర్ధ రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. ఈ ఘటనపై శుక్రవారం విచారణ చేపట్టారు. మద్దిపాడులోని వెంకటేశ్వర రైస్ మిల్లును నెల్లూరుకు చెందిన ఓ వ్యక్తి లీజుకు తీసుకున్నాడని అధికారులు తెలిపారు. కొంతకాలం నుంచి ఇక్కడ పెద్దఎత్తున బియ్యం తీసుకొచ్చి పాలిసింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు. సదరు రైస్ మిల్లులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పోలీసు, రెవెన్యూ అధికారులు గురువారం అర్ధరాత్రి దాడి చేసి పట్టుకున్నారు. రేషన్ బస్తాలతో పాటు పాలిషింగ్ చేసి.. ప్యాకింగ్‌గా మార్చిన బియ్యం బస్తాలను సైతం స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 2,108 రేషన్ బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. దీని విలువ రూ.40 లక్షల వరకు ఉంటుందన్నారు. అద్దంకి, బాపట్ల నుండి రేషన్ బియ్యం సేకరించి ఈ మిల్లులో పాలిషింగ్ చేసి.. చెన్నై పోర్టు ద్వారా తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విచారణలో ఏఎస్ఓ పున్నయ్య, సివిల్ సప్లై డిటీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ఇన్స్పెక్టర్ వంశీ, ఎమ్మార్వో నారాయణరెడ్డి పలువురు ఉన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కౌన్సెలింగ్‌లో జాప్యం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అన్‌విల్లింగ్ ఇచ్చేందుకు బారులు తీరిన ఉపాధ్యాయులు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఖాళీగా ఉన్న 279 స్కూల్ అసిస్టెంట్స్, 153 పిఎస్ హెచ్‌ఎం పోస్టులకు శుక్రవారం చేపట్టిన కౌన్సిలింగ్ ప్రక్రియలో జాప్యం జరుగుతుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులతో పాటు పిఎస్ హెచ్ ఎంల కౌన్సిలింగ్ కు గురువారం నాడే 1:3 నిష్పత్తి ప్రకారం సీనియారిటీ జాబితా రూపొందించి ఎనిమిది గంటలకు ఒంగోలు డిఆర్ఆర్ఎం మున్సిపల్ స్కూల్‌కు హాజరుకావాలని నిన్న ప్రకటించారు. ఇదే సమాచారం వివిధ ఉపాధ్యాయులకు చెందిన మాధ్యమాల ద్వారా అందించారు. మొదటగా ఎక్కువ ఖాళీలు ఉన్న పిఎస్ హెచ్‌ఎం పోస్టులకు సంబందించిన కౌన్సిలింగ్ చేపట్టాలని భావించిన జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ ఆ మేరకు బాధ్యత ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చించి, రోస్టర్ జాబితా సిద్ధం చేశారు. గుంటూరు నుంచి ఆలస్యంగా కౌన్సిలింగ్ హాజరైన రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి తొలుత స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ చేపట్టాలని ఆదేశించడంతో స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన రోస్టర్ జాబితాను అప్పటికప్పుడు తయారుచేసి స్కూల్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్ చేపట్టారు. ఈ ప్రక్రియ రాత్రి ఎన్ని గంటల వరకు కొనసాగింది. ఇదిలా ఉండగా కౌన్సిలింగ్ హాజరైన 1300 మందిలో పిఎస్ హెచ్‌ఎం పోస్టులకు అన్విల్లింగ్ తెలిపే ప్రక్రియ ఆలస్యంగా చేపట్టడం వల్ల పీఎస్ హెచ్‌ఎంల కౌన్సిలింగ్ ఆలస్యంగా మొదలైంది. 153 ఖాళీలకు సంబంధించి ఉపాధ్యాయులు తగినంత మంది ముందుకు రాని పక్షాన, తరువాత సీనియారిటీ ప్రకారం కౌన్సిలింగ్‌కు పిలిచే అవకాశం ఉంది. కమిషరేట్‌కు, జిల్లా అధికారుల మధ్య సమన్వయం లేని కారణంగా అన్ విల్లింగ్ తెలపడానికి ఉపాధ్యాయులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. అరంభం నుంచి విద్యా శాఖ కమిషనరేట్ వ్యవహారిస్తున్న తీరు పట్ల ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలింగ్ నిర్వహణలో డీఈవోతోపాటు ఆర్జెడి లింగేశ్వర రెడ్డి, రీజినల్ ఇన్స్పెక్షన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్.కె.మహబూబ్ బాషా, డిసిఈబి కన్వీనర్ మర్రి శ్రీనివాసరావు, డిప్యూటీ డిఈఓ చంద్రమౌళేశ్వరరావ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ అబ్దుల్ హై,డి విరాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎస్ రవి, ఎపిటి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ లక్ష్మినారాయణ, నాయకులు పి వి సుబ్బారావు, పిఆర్‌టియూ నాయకులు పులి శ్రీనివాస్, ఎస్‌టియూ నాయకులు ఎర్రయ్య, ఎ పి టి ఎఫ్ (257)నాయకులు శ్రీనివాసులు, ఎ.అమ్మయ్య, వై అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు
వైద్యాధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పేషెంట్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని (జిజిహెచ్) మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లలో చేపడుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించి వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం మదర్ న్యూబోర్న్ కేర్ యూనిట్, స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లలో అన్ని మౌలిక సదుపాయాలతో నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పలు విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు, వైద్యులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను ఐక్యంగా కాపాడుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి- కనిగిరి

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

దేశ సమగ్రతను ఐక్యంగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి తెలిపారు. కనిగిరి మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో 'మత సామరస్యం.. దేశ సమగ్రతకై..' అనే అంశంపై ఐక్యతా సదస్సు సిపిఎం పట్టణ కార్యదర్శి పిసి.కేశవరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ పహాల్గంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను అదుపులోకి తీసుకోవడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మత విద్వేషాలకు తావు లేకుండా ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని దేశ సమగ్రతకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఓకే పాస్టర్ల సంఘం నాయకుడు సుధాకర్, సిపిఎం నాయకులు ఎస్‌కె.బషీరా, ఏడుకొండలు, నరేంద్ర, యు. పిచ్చయ్య, ప్రసన్న, శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దిష్ట గడువు వరకూ వేచి ఉండకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె అధ్యక్షతన ప్రకాశం భవనములో ప్రత్యేక జిల్లా పరిశ్రమలు,ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (స్పెషల్ డిఐఈపిసి) సమావేశం జరిగింది. జిల్లాలో పరిశ్రమలకు చెందిన వివిధ రాయితీలలో 449 క్లెయిమ్స్‌కు రూ.7 కోట్లా 22 లక్షలు మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ సంస్థ జనరల్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఏపి సిపిడిసిఎల్ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నాబార్డు ఏజిఎం రవికుమార్, ఏపిఐఐసి, కాలుష్య నియంత్రణ మండలి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కురిచేడు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సస్పెన్షన్

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.సతీష్‌బాబు సస్పెండ్ అయ్యారు. పూర్వపు గుంటూరు జిల్లా, ప్రస్తుత బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు మేజర్ పంచాయతీకి 2019 సంవత్సర కాలంలో పంచాయతీ కార్యదర్శిగా సతీష్‌బాబు పనిచేశారు. 2019 నుండి 2022 వరకు కోటి ఎనభై లక్షల రూపాయల నగదు దుర్వినియోగమైంది. అప్పటి అధికారులు విచారణకు ఆదేశించగా సుదర్ఘీకాలం పాటు జరిగిన విచారణలో నలుగురు పంచాయతీ కార్యదర్శులు, ఇద్దరు పంచాయతీ సిబ్బంది ఈ కుంభకోణంలో ఉన్నారని అధికారులు తేల్చారు. ఈ విచారణ సమయంలోనే సతీష్‌బాబుకు ప్రమోషన్ వచ్చి ప్రకాశం జిల్లా పెద్దారవీడు ఇ.ఒ.ఆర్.డి.గా విధులు నిర్వహించారు. అక్కడ నుండి బదిలీలలో భాగంగా కురిచేడు ఇ.ఒ.ఆర్.డి.గా బదిలీపై వచ్చారు. కురిచేడు మండల పరిషత్‌కి శాశ్వత యం.పి.డి.ఒ. లేకపోవడంతో ఇ.ఒ.ఆర్.డి.గా పనిచేస్తున్న సతీష్‌బాబును ఇన్‌ఛార్జ్ యం.పి.డి.ఒ.గా జిల్లా పరిషత్ అధికారులు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ పనిచేస్తున్న సమయంలో గతంలో పనిచేసిన చోట జరిగిన అవకతవకలకు విచారణ పూర్తయి ఆ నివేదిక వచ్చిన తరువాత అందులో అప్పటి పంచాయతీ కార్యదర్శి సతీష్ బాబు పాత్ర ఉందని తేలడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎస్సీ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు
పరీక్షల తీరు పరిశీలించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో మెగా డిఎస్‌సి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా డిఎస్‌సి పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలులో మెగా డిఎస్సీ పరీక్ష జరుగుతున్న బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో పరీక్ష జరగుతున్న తీరుతెన్నులను ఆమె పరిశీలించారు. అభ్యర్థులకు అక్కడ కల్పించిన వసతులను, పరీక్ష నిర్వహణను, బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో మెగా డిఎస్సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 8 కేంద్రాల్లో మెగా డిఎస్‌సి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించామన్నారు. అభ్యర్థులకు ఏమాత్రం ఇబ్బంది కలుగకుండా అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పి.మధుసూదన్‌రావు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలి
జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో విస్తరింపజేయాలనే లక్ష్యంతో వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి ప్రజా భాగస్వామ్య ప్రకతి వ్యవసాయం ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ తెలిపారు. మూడు రోజుల పాటు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బందికి స్థానిక శిక్షణాకేంద్రంలో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, ప్రకతి వ్యవసాయ శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. చిన్నసన్నకారు, కౌలు రైతులు అందరికీ ప్రకతి వ్యవసాయ విధానాలపై, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రకతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు కషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ప్రకతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, అందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.జెన్నెమ్మ మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగులో ప్రకతి వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా మంచి ప్రయోజనాలు పొందవచ్చునని తెలియజేశారు. ఇంటి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ప్రకతి వ్యవసాయ విధానంలో పెరటి తోటలు పెంచుకొని పురుగు మందుల అవశేషాలు లేని కూరగాయలను, పండ్లను తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ విభాగం రాష్ట్రస్థాయి అధికారులు రామచంద్రం, భాగ్యలక్ష్మి, అడిషనల్ డిపిఎం మోహన్, ప్రకతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.